క్లుప్తంగా

చియ్యపాడులో కంటి వైద్య వైద్య పరీక్షలు

చాపాడు : మండలంలోని చియ్యపాడులో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. కంటి చూపు లోపించిన అవ్వాతాతలకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం బాసటగా నిలుస్తుందన్నారు. కంటి వైద్యులు ఎమ్మెస్ తేజ 60 ఏళ్లు పైబడిన 73 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 32 మందికి శస్త్ర చికిత్స కోసం ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులలో ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు నుంచి షిర్డీకి ప్రత్యేక బస్సు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో నుంచి షిర్డీకి ప్రత్యేక ఏసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు డిపో నుంచి బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. రానుపోను కలిపి టికెట్ ధర రూ.4,500 చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. మధ్యలో తుల్జాపూర్ భవాని మాత ఆలయం, శనిసింగనపూర్ ఆలయాల్లో స్వామివారి దర్శనం కల్పిస్తామని వివరించారు. బుకింగ్ కోసం బస్టాండ్‌లో కానీ, www.apsrtconline.inలో సంప్రదించాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం ప్రొద్దుటూరు నుంచి తొలి మారు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వివరించారు.

రేపు పెన్షనర్ల సమావేశం

మైదుకూరు : ఈనెల 5వ తేదీన మండలంలోని పెన్షనర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.ఓబన్న, కార్యదర్శి మల్లెల కుళ్లాయిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు పట్టణంలోని సాయినాథపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో పెన్షనర్లందరూ పాల్గొనాలని వారు కోరారు.

10న చెట్ల వేలం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ఉన్న 25 చెట్లను కొట్టుకుని తీసుకుని పోయేందుకు బహిరంగ వేలం వేస్తున్నామని, ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈనెల 10న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.20వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దాదాపు 20 – 25 టన్నుల వరకు ఉండే ఈ చెట్లను వేలం వేస్తామని, పాట దక్కించుకున్న వారు వెంటనే డబ్బు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాశినాయన : మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపాడు, ఆకులనారాయణపల్లె బీసీ పురుషుడు, ఇటుగుల్లపాడు ఓసీ మహిళ, కత్తెరగండ్ల ఎస్సీ పురుషుడు, సావిశెట్టిపల్లె రెండు పోస్టులు ఎస్సీ మహిళలకు రిజర్వు చేయబడ్డాయని తెలిపారు. 6వ తేదీ సాయంత్రంలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8వ తేదీన ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఆసక్తి గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామీల బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామివారికి ద్వారతోరణ ధ్వజకుంభ ప్రార్థన, అగ్నిప్రతిష్ఠ, అభిషేకం తదితర కార్యక్రమాలను వేదపండితులు సూర్యప్రకాశరావు, పెద్ద వీరయ్య, పిచ్చయ్యల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక అలంకరణలో ఉంచారు. భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి పెంచలకోనకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : పెనుశిల లక్ష్మీనరసింహస్వామి (పెంచలకోన) బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు బద్వేలు డిపో నుంచి పెంచలకోనకు 12 స్పెషల్ బస్సులు నడపనున్నట్లు బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రారంభమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లు

వేంపల్లె : పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన తెలుపుతూ సైన్స్ విభాగంలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఎమ్మెస్సీ, బీఎస్సీ బీజెడ్సీ, అలాగే ఆర్ట్స్ విభాగంలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఏ హెచ్‌ఈసీ, హెచ్‌పీ స్పెషల్ ఇంగ్లీషు గ్రూపులు కలవన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



లబ్ధిదారురాలికి పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం కనిపిస్తోందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. మున్సిపాలిటీ పరిధి 31 వార్డులోని సురేంద్రనగర్‌లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టోను ఒక భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించి అందులో పొందుపరిచిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు పద్మావతి, చెన్నయ్య, వార్డు ఇన్‌చార్జి చెన్నకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, మెప్మా టీఎంసీ అయ్యవారయ్య, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బద్వేలు : మండలంలోని సావిశెట్టిపల్లె పంచాయతీలో గురువారం సాయంత్రం 3 గంటలకు బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా



వాసవీ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడాన్ని అడ్డుకుంటామని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను దక్షిణ కొరియా పోస్కో కంపెనీకి, ఆదాని కంపెనీకి విక్రయించే ప్రయత్నాన్ని విరమించుకోవాలంటూ బుధవారం పట్టణంలోని వాసవీ సర్కిల్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఎంతో మంది బలిదానాలతో నిర్మితమైందన్నారు. దేశంలోని పరిశ్రమలన్నింటికీ గనుల కేటాయింపు ఉందని, అయితే విశాఖకు మాత్రం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలను అందించకున్నా అక్కడి కార్మికులు గతేడాది కూడా రూ. 30 కోట్ల లాభాలను చూపారన్నారు. సీఐటీయూ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండుసార్లు బంద్ నిర్వహించినా పెడచెవిన పెడుతున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దిన్, ఏఐటీయూసీ పట్టణ నాయకులు వై హరి, మద్దిలేటి, నిర్మల, సీఐటీయూ నాయకులు సాల్మన్, ఓబయ్య, సురేష్, ఐఎన్‌టీయూసీ అసెంబ్లీ ఇంచార్జి కొండయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై బుధవారం పోరుమామిళ్లలో సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ ప్రైవేటీకరణ ఆపేంతవరకు ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రవి, కేశవ, ఫిరోజ్, రమేష్, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అరికట్టాలి



మాట్లాడుతున్న అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ నందన్

జమ్మలమడుగు రూరల్ : మండలపరిధిలో అధికారుల అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలపై అధికారులు దృష్టి సారించాలని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వై.ఓ.నందన్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మైలవరం, పెద్దముడియం మండలాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల పరిధిలోని అయా సచివాలయాల్లోని పరిధిలో భవన నిర్మాణాలు, లేఅవుట్‌లకు అధికారుల అనుమతులు తీసుకోకుండా నిర్మించడం వల్ల పంచాయతీకి రావలసిన ఆదాయానికి గండి పడుతున్నదని ఆయన తెలిపారు. భవనాలు నిర్మిస్తున్నప్పుడు తప్పనిసరిగా అప్రూవల్ తీసుకొనేవిధంగా చూడలన్నారు. అలా తీసుకోని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. 300 చ.మీ. వరకు పంచాయతీ కార్యదర్శులతో ఆపైన భవన నిర్మాణాలు, లేఅవుట్లకు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారితో అనుమతులు పొందాలన్నారు. ఇందులో ఏ మాత్రం అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి టి.కృష్ణసింగ్, డీఎల్పీఓ విజయ్‌కుమార్ ఎంపీడీఓ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సింహాద్రిపురం : మండల పరిధిలోని రావులకొలను గ్రామంలో బుధవారం మారెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పలు బృందాలచే చెక్కభజన కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీవల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమైయ్యాయి. మొదటి రోజు ఉదయం తదితర పూజాధికార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మోక్ష నారాయణ స్వామిని హనుమద్వాహనంపై, సుబ్రమణ్య స్వామిని వృషభ వాహనంపై ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వేళాంగిణికి బస్సు సౌకర్యం

జమ్మలమడుగు : జమ్మలమడుగు డిపో నుంచి తమిళనాడులోని వేళాంగిని, నాగపట్నంకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు తెలిపారు. బుధవారం స్థానిక డిపోలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జమ్మలమడుగు నుంచి బస్సు బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఆరుగంటలకు, నాగూరు, వేళాంగిని చేరుకుంటుందన్నారు. తిరిగి 13వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వేళాంగిని నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఐదు గంటలకు జమ్మలమడుగుకు చేరుకుంటుందన్నారు. టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.2,630 ఉంటుందన్నారు.

ఖాదర్‌ఖాన్ కొట్టాల ఎద్దులు ఫస్ట్



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

వల్లూరు : కోదండ రామాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన ఆరు పళ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీల్లో మొత్తం 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో కడప మండలం ఖాదర్‌ఖాన్‌కొట్టాలుకు చెందిన డి.భావనశ్రీ ఎద్దులు 3410 అడుగులు బండను లాగి మొదటి స్థానంలో, ప్రొద్దుటూరు మండలం నాగాయపల్లెకు చెందిన తవ్వా చంద్రవిజయకుమార్‌రెడ్డి ఎద్దులు 3269 అడుగులు లాగి రెండవ స్థానంలో, మైదుకూరు మండలం సరస్వతీపేటకు చెందిన బొగ్గుల రాజేశ్వరి ఎద్దు, ఖాజీపేట మండలం సుంకేసులకు చెందిన మద్దూరు ఆదిరెడ్డి ఎద్దు కలిసి 3090 అడుగులు లాగి మూడవ స్థానంలో, వీరపునాయునిపల్లె మండలం తలపనూరుకు చెందిన గంగిరెడ్డిగారి గంగిరెడ్డి ఎద్దు, వల్లూరు మండలం చిన్న నాగిరెడ్డిపల్లెకు చెందిన నారంగారి తారక్‌రెడ్డి ఎద్దు కలిసి 3000 అడుగులు లాగి నాలుగవ స్థానంలో, కొండాపురం మండలం బెడుదూరుకు చెందిన వి.శ్రీనివాసులు ఎద్దు, రాజుపాలెం మండలం కూలూరుకు చెందిన సంపత్‌కుమార్ ఎద్దు కలసి 2976 అడుగులు లాగి ఐదవస్థానంలో, వల్లూరు మండలం సీతోరిపల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి ఎద్దులు 2886 అడుగులు లాగి ఆరవ స్థానంలో, నంద్యాల జిల్లా సంజామల మండలం ఆర్.లింగందిన్నెకు చెందిన మేకల సుదర్శన్ ఎద్దులు 2830 అడుగులు లాగి ఏడవ స్థానంలో, వల్లూరు మండలం చెరువుకిందిపల్లెకు చెందిన తుమ్మలూరు విజయ భాస్కర్‌రెడ్డి ఎద్దులు 2772 అడుగులు లాగి ఎనిమిదవ స్థానంలో నిలిచాయి. విజేతలకు దాతల చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. యాంకర్ గంగారు చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానం ఉత్తేజభరితంగా సాగింది.

కలమల్ల ఎస్‌ఐగా సంజీవరెడ్డి బాధ్యతల స్వీకరణ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల ఎస్‌ఐగా సంజీవరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రొద్దుటూరు రూరల్ ఎస్‌ఐగా పనిచేస్తున్న సంజీవరెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ శివప్రసాద్ ప్రొద్దుటూరు రూరల్‌కు బదిలీ అయ్యారు.

వైభవంగా ధ్వజారోహణం



సేవాధిపతి ఉత్సవ పూజ నిర్వహిస్తున్న దృశ్యం

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతలకోన పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణం కార్యాక్రమాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్ ప్రారంభించారు. వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, శాంతి హోమం, రాత్రి శేషవాహన సేవ వంటి కార్యాక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నేడు నరసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


నేడు ధ్వజారోహణం..

జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 8:45 నిమిషాల నుంచి 9:45 మధ్యలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నారాపుర స్వామి ఆలయ అధికారులు తెలిపారు. సాయంత్రం పెద్దశేష వాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహించడంతోపాటు భక్తులకు హరికథ కాలక్షేపం ఉంటుందన్నారు. బుధవారం రాత్రి స్వామి వారిని సేవాధిపతి ఉత్సవ అంకురార్పణలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తాతిరెడ్డితులసి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడి పాల్గొన్నారు.

ఆర్టీపీపీ-ప్రొద్దుటూరు రోడ్డును బాగు చేయండి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఆర్టీపీపీ-ప్రొద్దుటూరుల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డును బాగు చేయాలని కోరుతూ బుధవారం ఆర్టీపీపీ సీఈ మురళికృష్ణకు ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ నేతలు వినతి పత్రం అందించారు. ప్రతి రోజు డ్యూటీ నిమిత్తం ప్రొద్దుటూరుకు తదితర ప్రాంతాలనుంచి వందలాది మంది ఉద్యోగులు కార్మికులు ప్రయాణించాల్సి ఉందన్నారు. తర్వగా మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బిరెడ్డి. గిరిబాబు, శేఖర్, హమీద్, శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



సమస్యలపై ఆరా తీస్తున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : స్పందనలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు త్వరగా పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డి కోరారు. బుధవారం మైలవరం మండలపరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామ సచివాలయంలో ఆయన ఎంపీడీఓ, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బంది రికార్డ్‌ల నిర్వహణ, స్పందనలో వచ్చిన ఆర్జీలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త చెన్నారెడ్డి, ఈట మహేశ్వర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం లక్ష్మినరసింహాస్వామి జయంతి, రాత్రికి ఊంజల్ సేవ, శుక్రవారం స్వామి వారికి అభిషేకం , రాత్రికి గరుడ సేవ, శనివారం లక్ష్మినరసింహస్వామి కల్యాణం ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు.

నందివాహనంపై ఊరేగిన అగస్త్యేశ్వరుడు



నంది వాహనంపై అగస్త్యేశ్వరస్వామి, గరుడ వాహనంపై అభయ వరద సీతారాములు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి, సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం నంది వాహనంపై గంగా రాజరాజేశ్వరిదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి, గరుడ వాహనంపై అభయ వరద సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగించారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

శ్రీకృష్ణమందిరం నూతన కార్యవర్గం ఎన్నిక



యాదవ సంఘం నూతన కమిటీని సన్మానిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్, తదితరులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణమందిరం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా చిట్టిబోయిన చెన్నయ్యయాదవ్, గౌరవాధ్యక్షుడిగా సింగరయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సంటెయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుబ్బరాయుడుయాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కోలా వెంకటసుబ్బయ్యయాదవ్, గోగుల ప్రసాద్‌యాదవ్‌లను ఎన్నుకున్నారు. అలాగే 6 మందిని కార్యవర్గ సభ్యులుగా, 5 మందిని గౌరవ సలహాదారులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, యాదవ సంఘం అధ్యక్షులు బుర్రి రాజాయాదవ్, యాదవ సంఘం మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఘనంగా సన్మానించారు.

దళితులకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కాన్‌స్టాన్‌టైన్



కాన్‌స్టాన్‌టైన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : దళితులకు ప్రత్యేక గుర్తింపు తెచ్చి వారికి జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవడానికి వారిలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన వ్యక్తి లక్కినేని డేనియల్ కాన్‌స్టాన్‌టైన్ అని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.ఎన్.ప్రసాద్‌లు తెలిపారు. కాన్‌స్టాన్‌టైన్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని సామాజిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఓ.ఎస్.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన వర్ధంతి సభలో వారు మాట్లాడారు. ఉద్యోగాన్ని సైతం వదిలి ఉద్యమాల వైపు అడుగులు వేసిన వ్యక్తి కాన్‌స్టాన్‌టైన్ అని వారు గుర్తు చేసుకున్నారు. తొలుత కాన్‌స్టాన్‌టైన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షుడు సొద్దల పెంచలయ్య, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు దేవానందం, సీనియర్ దళిత నాయకులు చెంగ్రాయుడు, ఓసూరి భాస్కర్, జకరయ్య, పిచ్చయ్య, మురళి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు వెంకటరమణ, బీసీ నాయకులు చంద్రశేఖర్, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



గుంతచీపాడు కృష్ణాలయం వద్ద ఉత్సవ విగ్రహాలను అందించిన కుటుంబీకులు

చాపాడు : మండల పరిధిలోని గుంతచీపాడు గ్రామంలో రుక్మిణీ వేణుగోపాల స్వామి సహిత గరుత్మంత ఉత్సవమూర్తి సంప్రోక్షణ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించారు. గత మూడు రోజులు నిర్వహిస్తున్న ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా హోమాలు, ప్రత్యేక పూజలతో ఉత్సవ విగ్రహ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ కృష్ణ, రుక్మిణీ దేవిల కల్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష రూపాయలు విలువ చేసే ఉత్సవ విగ్రహాలను అందించిన గ్రామానికి చెందిన అన్నపురెడ్డి రామాంజనేయరెడ్డి, వరద రాజేశ్వరీ దంపతులను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఇదే క్రమంలో ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం చేసిన విశ్వనాథపురం కార్తీక్ రెడ్డిని సత్కరించారు. ఉత్సవ వేడుకలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

అడివయ్య సత్రం ఆక్రమణపై ఫిర్యాదు

అట్లూరు : అట్లూరు క్రాస్‌రోడ్డులో ఉన్న అడివయ్య సత్రంను ఆక్రమణకు గురికానివ్వద్దు అంటూ అట్లూరు గ్రామానికి చెందిన యాదవ కుటుంబాలు, స్థానిక నాయకులు బుధవారం తహసీల్దారు శ్రీవాణికి ఫిర్యాదు చేశారు. సుమారు 50 సంవత్సరాల క్రితం యాదవ కులానికి చెందిన అడివయ్య అట్లూరు క్రాస్ రోడ్డులో పాదచారుల విశ్రాంతి కోసం సత్రం నిర్మించారు. అక్కడ తాగునీటికోసం భావిని కూడా తవ్వించారు. ఆయన మరణానంతరం అడివయ్య సత్రం అడివయ్య భావిగా ప్రసిద్ధి చెందింది. అయితే నెల్లూరు జిల్లాలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి నకిలీ డాక్యుమెట్లు పుట్టించి అందులో అడివయ్య తనకు వ్రాసి ఇచ్చినట్లు చూపిస్తూ సత్రంలోకి ఎవరిని వెళ్లనీయకుండా అక్కడే చిల్లర అంగడి పెట్టుకున్నాడన్నారు. నకిలీ డాక్యుమెంటును సృష్టించిన అతనిపై చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ విచారించి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.



కాసిన మొక్కజొన్న కంకి

ఆశాజనకంగా మొక్కజొన్న



టంగుటూరు గ్రామంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

మండలంలోని టంగుటూరు గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉంది. పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం క్వింటా ధర రూ.1800 పలుకుతోందని, ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని సాగు చేసిన రైతులు తెలిపారు. దాదాపు 95 ఎకరాల్లో పంట సాగైనట్లు రైతులు తెలిపారు. – రాజుపాళెం